

నిరసన తెలుపుతున్న వాకర్స్ అసోసియేషన్ సభ్యులు

ఇందిరాపార్కులో వేడుకలకు నిరాకరణ

● అడ్డుకున్న సెక్యూరిటీ సిబ్బంది ● వాకర్స్ అసోసియేషన్ నిరసన

కవాడిగూడ, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): ఇందిరాపార్కులో హోలీ వేడుకలను అధికారులు, సెక్యూరిటీ సిబ్బంది అడ్డుకోవడంపై వాకర్స్ అసోసియేషన్ సభ్యులు నిరసనకు దిగారు. జీహెచ్ఎంసీ అధికారులు, సెక్యూరిటీ సిబ్బందితో అసోసియేషన్ సభ్యులు వాగ్వాదానికి దిగడంతో సోమవారం ఉద్రిక్తత నెలకొంది. అధికారులు అనుమతి ఇచ్చి అడ్డుకోవడం ఎంతవరకు సమంజసమని అసోసియేషన్ ప్రతినిధులు నిలదీశారు. అధికారులు ఓ వర్గానికి కొమ్ముకాస్తూ అనేక సంవత్సరాలుగా ఇందిరాపార్కులో జరుగుతున్న హోలీ వేడుకలను అడ్డుకోవడం దారుణమన్నారు. జీహెచ్ఎంసీ, పోలీస్ విభాగాల నుంచి అనుమతి తీసుకున్నా అనుమతించకపోవడంపై నిరసన వ్యక్తం చేశారు. ఉస్మానియా యూనివర్సిటీ, పబ్లిక్‌గార్డెన్స్, ఎగ్జిబిషన్ గ్రౌండ్, సుందరయ్యపార్కులో హోలీ వేడుకలకు అనుమతి ఇచ్చి ఇందిరాపార్కులో చేసుకోనీయకపోవడం ఏమిటని ప్రశ్నించారు. ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని వాకర్స్ అసోసియేషన్ ప్రతినిధులు తెలిపారు. నిరసన కార్యక్రమంలో వాకర్స్ అసోసియేషన్ ప్రతినిధులు ఎం. శ్రీనివాస్‌ముదిరాజ్, తాటి శ్రీనివాస్, బి.నరేందర్, సాయిరెడ్డి, కిషన్‌గౌడ్, శేరుపల్లి గణేష్, సంగిశెట్టి శ్రీధర్‌రాజ్, అరుణ్‌గౌడ్, చందు, రమేష్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

హోలీతో కమ్యూనికేషన్ నైపుణ్యాలు

హోలీతో కమ్యూనికేషన్ నైపుణ్యాలు పెరుగుతాయని ప్రోగ్రెసివ్ సైకాలజిస్ట్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా అధ్యక్షురాలు డాక్టర్ హిప్నో పద్మాకమలాకర్, బి. సరోజిని రామారావు, జ్యోతిరాజా అన్నారు. ఇందిరాపార్కులో యోగా గురు బొబ్బిలి సరోజిని రామారావు ఆధ్వర్యంలో సోమవారం హోలీ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, హోలీ వేడుకల్లో తెలుపు రంగు దుస్తులు ధరించడంవల్ల ఎండ తీవ్రతను తట్టుకోగలరని, వర్ణాలన్నీ దుస్తులపై కనిపిస్తే ఇంద్రధనస్సులా అద్భుతంగా ఉంటుందన్నారు. అందుకే తెలుపు దుస్తులు ధరిస్తారని, రంగులు అన్నీ ఎమోషన్స్‌ను తెలుపుతాయని పేర్కొన్నారు. ఆనందాలను, అనుబంధాలను కలిసి మెలిసి ఉండేలా చేస్తుందన్నారు. కార్యక్రమంలో బి. రామారావు, డాక్టర్ గీత, జ్యోతిరాజా, శోభారాణి, పూర్ణకుమారి, వాణిశ్రీ, సుజాత, శ్రీలత, రాజేంద్రప్రసాద్, వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

హోలీ.. రంగుల కేళీ

వాడవాడలా ఘనంగా వేడుకలు

ముషీరాబాద్/అంబర్‌పేట జోన్ బృందం, ఆంధ్రజ్యోతి: ముషీరాబాద్, అంబర్‌పేట నియోజకవర్గాల్లో సోమవారం హోలీ వేడుకలు ఘనంగా జరిగాయి. చిన్నా, పెద్ద అనే తేడా లేకుండా రంగులు చల్లుకున్నారు. ప్రజాప్రతినిధులు, రాజకీయ నాయకులు బస్తీలు, కాలనీల్లో ప్రజలను కలిసి హోలీ శుభాకాంక్షలు తెలిపారు.



బాకారంలో హోలీ వేడుకల్లో కార్పొరేటర్ కె.రవిచారి తదితరులు



డీడీ కాలనీలో మహిళలతో బాగ్అంబర్‌పేట కార్పొరేటర్ పద్మావెంకటరెడ్డి



విద్యానగర్‌లో హోలీ వేడుకల్లో టీజేఎస్ రాష్ట్ర అధ్యక్షుడు ప్రొఫెసర్ కోదండరాం తదితరులు



అంబర్‌పేట పటేల్‌నగర్‌లో రంగునీళ్లు చల్లుతున్న చిన్నారి



కవాడిగూడలో హోలీ వేడుకల్లో యువకుల సెల్ఫీ



చిక్కడపల్లిలో హోలీ వేడుకల్లో పాల్గొని చిన్నారి నుదుట రంగు పూస్తున్న ఇన్‌స్పెక్టర్ ఏరుకొండ సీతయ్య



చిక్కడపల్లి నగర కేంద్ర గ్రంథాలయంలో హోలీ వేడుకల్లో పోటీ పరీక్షల అభ్యర్థులు



చిక్కడపల్లిలో బీజేపీ నాయకులతో కలిసి హోలీ ఆడిన కార్పొరేటర్ పావని వినయ్‌కుమార్



గోల్నాకలో కుటుంబ సభ్యులు, మహిళా నాయకులతో హోలీ ఆడుతున్న కార్పొరేటర్ దూసరి లావణ్య శ్రీనివాస్‌గౌడ్



గోల్నాకలో మహిళలతో ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ సతీమణి పద్మ తదితరులు



ముషీరాబాద్ పద్మశాలి కాలనీలో చిన్నారులకు చిలకల దండలు వేసిన రాజపేట చారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షుడు ఆంజనేయులు, సుజాత



గాంధీనగర్‌లో హోలీ వేడుకల్లో రాజీవ్‌గాంధీనగర పాలిక సంఘటన్ గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షుడు గుర్రం శంకర్ తదితరులు



రాంనగర్ వైఎస్సార్ పార్కు వద్ద చిన్నారుల హోలీ సందడి



అంబర్‌పేట ప్రేమ్‌నగర్‌లో హోలీ వేడుకల్లో బీజేపీ మైనారిటీ మోర్చా రాష్ట్ర మీడియా కన్వీనర్ ఎం. జబాక్‌రాజ్ తదితరులు



ముషీరాబాద్‌లో రంగులు పూసుకుంటున్న చిన్నారులు

29న టీడీపీ ఆవిర్భావ దినోత్సవం

రాంనగర్, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): టీడీపీ ఆవిర్భావ దినోత్సవాన్ని ఈ నెల 29న నిర్వహిస్తున్నామని సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం అధ్యక్షుడు పి. సాయిబాబా తెలిపారు. సోమవారం దోమలగూడలో నగర కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా పలు సేవా కార్యక్రమాలతోపాటు పార్టీ పతాకావిష్కరణ చేస్తామన్నారు. పేదలకు అన్నదానం, ప్రభుత్వ ఆస్పత్రులలో రోగులకు పండ్ల పంపిణీ, ప్రజలకు స్వీట్ల పంపిణీ వంటి కార్యక్రమాలను పార్టీశ్రేణులు నగరవ్యాప్తంగా నిర్వహిస్తారని పేర్కొన్నారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు. సమావేశంలో టీడీపీ సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం ప్రధాన కార్యదర్శులు నల్లెల కిషోర్, పలుస బాల్‌రాజ్‌గౌడ్, నాయకులు జి.యాదగిరిరావు, ఎస్.ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

ఆలయాల్లో సామూహిక సత్యనారాయణస్వామి వ్రతాలు

చిక్కడపల్లి, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): పలు ఆలయాల్లో సోమవారం సామూహిక సత్యనారాయణస్వామి వ్రతాలు నిర్వహించారు. చిక్కడపల్లి వేంకటేశ్వరస్వామి, ఆర్టీసీ క్రాస్‌రోడ్‌లోని లక్ష్మీగణపతి ఆలయం, వివేక్‌నగర్ ఆంజనేయస్వామి ఆలయాల్లో సత్యనారాయణస్వామి వ్రతాలు నిర్వహించగా పెద్దఎత్తున భక్తులు పాల్గొన్నారు.

'పద్మారావుగౌడ్‌ను భారీ మెజార్టీతో గెలిపిస్తాం'

ముషీరాబాద్, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): లోక్‌సభ ఎన్నికల్లో సికింద్రాబాద్ నియోజకవర్గం నుంచి బీఆర్ఎస్ అభ్యర్థి పద్మారావుగౌడ్‌ను భారీ మెజార్టీతో గెలిపిస్తామని ఆ పార్టీ నాయకుడు ముఠా జైసింహ అన్నారు. సోమవారం భోలక్‌పూర్‌లో బీఆర్ఎస్ ముషీరాబాద్ డివిజన్ మాజీ అధ్యక్షుడు సయ్యద్ అహ్మద్ భక్తియార్ ఆధ్వర్యంలో పద్మారావుగౌడ్‌కు మద్దతుగా మైనార్టీ కమిటీ నాయకులతో సమావేశం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న జైసింహ మాట్లాడుతూ.. సికింద్రాబాద్‌లో పద్మారావుగౌడ్‌ను గెలిపించి బీఆర్ఎస్ సత్తా చాటుతామన్నారు. సమావేశంలో టి. పద్మారావుగౌడ్ కుమారుడు, బీఆర్ఎస్ నాయకుడు రామేశ్వర్ గౌడ్, మైనార్టీ కమిటీ నాయకులు మున్వర్‌చాంద్, అబ్రార్ హుస్సేన్ ఆజాద్, ఖదీర్, మోహిన్, అక్లక్‌హుస్సేన్, గౌస్, జహీరుద్దీన్ సమర్ పాల్గొన్నారు.



మహిళలను సన్మానించిన కేవీ రమణాచారి, సంధ్యారాణి

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి

ముషీరాబాద్, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): మహిళలు అన్ని రంగాల్లో రాణించినప్పుడే దేశం అభివృద్ధి చెందుతుందని ఐఏఎస్ విశ్రాంత అధికారి కేవీ రమణాచారి అన్నారు. సోమవారం ఆకాంక్ష చారిటబుల్ ట్రస్ట్ 6వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని మహిళా దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా పలు రంగాల్లో ప్రతిభావంతులైన మహిళలను ఆయన సన్మానించారు. కార్యక్రమంలో ఆకాంక్ష చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపక కార్యదర్శి సంధ్యారాణి, సీనియర్ పాత్రికేయుడు వల్లీశ్వర్, మోహనకృష్ణ, పద్మ, విక్టోరియా, దివ్యా తేజస్వి, హేమలత, మల్లీశ్వరి పాల్గొన్నారు.

బీసీ రాజ్యాధికార సమితి రాష్ట్ర కో-ఆర్డినేటర్‌గా

వెంకటరమణ నియామకం

రాంనగర్, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): బీసీ రాజ్యాధికార సమితి రాష్ట్ర కో-ఆర్డినేటర్‌గా డాక్టర్ బీమానతుల వెంకటరమణ నియమితులయ్యారు. ఆదివారం బాగ్‌లింగంపల్లిలో సంఘం కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన నియామకాన్ని బీసీ రాజ్యాధికార సమితి రాష్ట్ర అధ్యక్షుడు దాసు సురేష్ ప్రకటించి నియామకపత్రం అందజేశారు.



వెంకటరమణకు నియామకపత్రం అందజేస్తున్న దాసు సురేష్



అయ్యప్ప ఆలయంలో పడిపూజ

శ్రీహరిహర పుత్ర ధర్మశాస్త్ర సంస్థ ఆధ్వర్యంలో సోమవారం బాగ్ అంబర్‌పేట అయ్యప్పస్వామి ఆలయంలో నక్షత్ర తిథి సందర్భంగా అయ్యప్ప పడిపూజ నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, బీజేపీ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ఎన్.గౌతమ్‌రావు, బీజేపీ సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం జాయింట్ కన్వీనర్ ఏడెల్లి అజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

- నల్లకుంట, ఆంధ్రజ్యోతి

వైన్‌షాపులు క్లోజ్.. బెల్ట్ షాపులు ఓపెన్

(5వ పేజీ తరువాయి)

లోయర్ ధూల్‌పేట్, ఇందిరానగర్, గుపానగర్ తదితర ప్రాంతాల్లోని బెల్ట్‌షాపుల్లో పెద్దఎత్తున మద్యం విక్రయాలు జరిగాయి. ఆదివారం రాత్రి నుంచి సోమవారం రాత్రి వరకు పెద్దఎత్తున అమ్మకాలు సాగాయి. బహిరంగంగా విక్రయాలు జరిపినా, ఆవైపు పోలీసు, ఎక్సైజ్ శాఖ అధికారులు కన్నెత్తి చూడలేదు. సైదాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని సింగరేణి కాలనీలో మద్యం ఏరులై పారింది. క్వార్టర్ బాటిల్ మీద రూ.50 నుంచి రూ.100 వరకు అదనంగా వసూలు చేశారు. వీధుల్లోనే కొందరు మహిళలు పోటీపడి మరీ విక్రయాలు జరిపారు.

మత్తులో ఎక్సైజ్ శాఖ అధికారులు

నగరంలోని పలుప్రాంతాల్లో వైన్‌షాప్ నిర్వాహకులే హోలీ వేళ.. బెల్ట్ షాపులను తెరిచారు. మద్యం విక్రయాలన్నీ ఎక్సైజ్‌శాఖ అధికారుల కనుసన్నల్లోనే జరిగాయనే ఆరోపణలున్నాయి. నాచారంలో ఓ వైన్‌షాపు నిర్వాహకులు సమీపంలో ఓ ఇంట్లో నుంచి విక్రయాలు జరపగా, అంబర్‌పేట, ముషీరాబాద్ లోనూ కొందరు వైన్‌షాపు నిర్వాహకులు అమ్మకాలు జరిపినట్లు తెలిసింది. లంగర్‌హౌస్‌లో ఓ బార్ అండ్ రెస్టారెంట్ యజమాని సమీపంలోని ఓ గోదాంలో మద్యం ఏర్పాటు చేసి జోరుగా విక్రయించినట్లు సమాచారం. గచ్చిబౌలిలోని ఓ పబ్ నిర్వాహకుడు కూడా వాహనంలో మద్యం అమ్మకాలు సాగించాడు. ఇలా నగరం నలుమూలాల హోలీ వేళ మద్యం విక్రయాలు పెద్దఎత్తున జరిపారు.

వేర్వేరు ప్రాంతాల్లో ముగ్గురి బలవన్మరణం

వనస్థలిపురం, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): వేర్వేరు ప్రాంతాల్లో ముగ్గురు ఆత్మహత్య చేసుకున్నారు. నెల్లూరు జిల్లా, కందుకూరు మండలం, పందలపాడు గ్రామానికి చెందిన వర్ల కిరణ్‌కుమార్(26) హస్తినాపురంలో సాహితీ బాయ్స్ హాస్టల్‌లో ఉంటూ మయూరి కమ్యూనికేషన్స్‌లో పనిచేస్తున్నాడు. ఆదివారం మధ్యాహ్నం హాస్టల్‌కు వచ్చిన కిరణ్‌కుమార్ గదిలోకి వెళ్లి తలుపులు వేసుకున్నాడు. సోమవారం ఉదయం వరకు తలుపు తీయకపోవడంతో పక్కనున్న రూమ్‌లో ఉంటున్న వారు తలుపు కొట్టారు. తీయకపోవడంతో హాస్టల్ నిర్వాహకుడు కిటికీలో నుంచి చూడగా కిరణ్‌కుమార్ సీలింగ్ ఫ్యాన్‌కు ఉరేసుకొని వేలాడుతూ ఉన్నాడు. వెంటనే పోలీసులకు సమాచారం ఇచ్చాడు. ఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మానసిక వేదనతో యువకుడు..

రాజేంద్రనగర్: మానసిక వేదనతో ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. రాజేంద్రనగర్ సర్కిల్ సిక్‌చావుని ప్రాంతానికి చెందిన హర్జీత్‌సింగ్, హర్వీందర్‌కౌర్‌కు ఇద్దరుకుమారులు. పెద్ద కుమారుడు మన్‌ప్రీత్‌సింగ్‌కు ఇటీవల ఓ హత్య కేసులో ఐదు సంవత్సరాల శిక్ష పడింది. అతడు జైలులో ఉన్నాడు. చిన్న కుమారుడు జస్ప్రీత్ సింగ్(19) వైట్‌నర్ లాంటివి పీలుస్తూ మత్తులో ఉంటాడు. సోదరుడికి జైలు శిక్ష పడడంతో మానసింగా కుంగిపోయాడు. ఆదివారం రాత్రి ఇంట్లో నుంచి బయటకు వెళ్లిన జస్ప్రీత్‌సింగ్ హుడా కాలనీ శ్మశానవాటికలో చెట్టుకు తలపాగాతో ఉరేసుకున్నాడు. సోమవారం మధ్యాహ్నం చూసిన స్థానికులు అత్తాపూర్ పోలీసులకు సమాచారం అందించారు. ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని ఉస్మానియా ఆస్పత్రికి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

జీవితంపై విరక్తితో..

మదీన: జీవితంపై విరక్తి చెంది ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. కేశవగిరిగుట్టలో నివసిస్తున్న రామచంద్రయ్య(45) మేస్త్రి పనిచేస్తుంటాడు. కొంతకాలంగా మద్యానికి బానిసవడంతో అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నాడు. జీవితంపై విరక్తి చెంది సోమవారం ఇంట్లో ఫ్యాన్‌కు ఉరేసుకున్నాడు. కుటుంబ సభ్యులు వెంటనే ఆస్పత్రికి తరలించారు. వైద్యులు పరీక్షించి మృతి చెందినట్లు నిర్ధారించారు. చాంద్రాయణగుట్ట పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పలుచోట్ల ముగ్గురి అదృశ్యం



నవీన్

నిజాంపేట్, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): నగరంలో పలు ప్రాంతాల్లో ముగ్గురు అదృశ్యమయ్యారు. ప్రగతినగర్ చర్చిరోడ్డులో సరానందిని ఎన్‌క్లేవ్‌లో నివసిస్తున్న డి. నవీన్(41) ప్రైవేట్ ఉద్యోగి. ఈనెల 24వ తేదీన నేరేడ్‌మెట్‌లో సోదరుడు సురేష్‌వీర్ ఇంటికి వెళ్లి సాయంత్రం తిరిగి వచ్చాడు. అదేరోజు రాత్రి 7 గంటల సమయంలో బయటకు వెళ్లి తిరిగి రాలేదు. అతడి ఆచూకీ లభించకపోవడంతో కుటుంబ సభ్యులు బాచుపల్లి పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

బాలుడు..

పహాడిషరీఫ్ మార్చి 25 (ఆంధ్రజ్యోతి): ఇంటి నుంచి బయటకు వెళ్లిన బాలుడు కనిపించకుండాపోయాడు. షాజహాన్ కాలనీకి చెందిన ఎండీ ఫక్రుద్దీన్ కుమారుడు, మహమ్మద్ షహీబాజ్ అన్సారీ(15) ఆదివారం మధ్యాహ్నం ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. అతడి ఆచూకీ లభించకపోవడంతో తండ్రి ఫక్రుద్దీన్ బాలాపూర్ పోలీసులకు సోమవారం ఫిర్యాదు చేశాడు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.



షహీబాజ్ అన్సారీ

మహారాజ్‌గంజ్‌లో వ్యక్తి..

మదీన, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): ఇంటి నుంచి బయటికి వెళ్లి ఓ వ్యక్తి అదృశ్యమయ్యాడు. ఒడిశాకు చెందిన సుభాచంద్(40), సుప్రభచంద్ భార్యాభర్తలు. బతుకుదెరువు కోసం ఏడాది క్రితం నగరానికి వచ్చి కామాటిపురా మహారాజ్‌గంజ్‌లో నివసిస్తున్నారు. దంపతులు ఇద్దరూ చందూలాల్ బారాదరిలో ఓ ఫ్యాక్టరీలో పనిచేస్తున్నారు. ఈనెల 24వ తేదీ మధ్యాహ్నం ఇద్దరూ పనికి వెళ్లలేదు. సుభాచంద్ బయటకు వెళ్లి తిరిగి రాలేదు. అతడి ఆచూకీ లభించకపోవడంతో భార్య కామాటిపురా పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు దర్యాప్తు చేస్తున్నారు.



సుభా చాంద్

భర్తకు తెలియకుండా అప్పులు

భార్యపై కత్తితో దాడి

జవహర్‌నగర్, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): తనకు తెలియకుండా అప్పులు చేయడంతో కోపోద్రిక్తుడైన భర్త భార్యపై కత్తితో దాడి చేసిన ఘటన జవహర్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. సీఐ నాగరాజు తెలిపిన వివరాల ప్రకారం.. బతుకుదెరువు కోసం నగరానికి వచ్చిన ఇందిర(39) భర్త పెద్దబ్బాయి, ఇద్దరు పిల్లలతో కలిసి జవహర్‌నగర్ సంతోష్‌నగర్‌లో నివసిస్తున్నారు. ఆమె నాటుకోడి చికెన్ సెంటర్ నిర్వహిస్తుండగా.. పెద్దబ్బాయి లారీ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. దంపతుల మధ్య తగాదాలతో పెద్దబ్బాయి మూడేళ్లుగా కుటుంబానికి దూరంగా ఉంటున్నాడు.

ఇటీవల భార్యాభర్తల మధ్య సయోధ్య కుదరడంతో మూడు నెలల నుంచి కలిసి ఉంటున్నారు. భర్తకు తెలియకుండా ఇందిర నాలుగు లక్షల రూపాయలు అప్పు చేసింది. అప్పు ఇచ్చిన వారు ఇంటికి వస్తుండడంతో పెద్దబ్బాయి భార్యను నిలదీశాడు. సోమవారం చికెన్ షాపు వద్ద ఉన్నప్పుడు మాటామాటా పెరగడంతో భర్త భార్యపై కత్తితో దాడిచేశారు. చేతికి, తలపై తీవ్రమైన గాయాలయ్యాయి. స్థానికులు పోలీసులకు సమాచారం ఇవ్వగా 108 అంబులెన్స్‌లో గాయపడిన ఇందిరను ఆస్పత్రికి తరలించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

'హత్యానేరాలకు కఠిన శిక్షలుండాలి'

చార్మినార్, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ నగరంలో హత్యలు పెరిగి పోయాయాని, నియంత్రించడంలో పోలీసులు విఫలం అయ్యారని ఏఐఎంఐఎం ఇంక్విలాబ్ పార్టీ ప్రధాన కార్యదర్శి కవి అబ్బాస్ అన్నారు. సోమవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ చిన్న చిన్న విషయాలకు హత్యలు చేస్తున్నారని, హత్య చేసిన నిందితులను కఠినంగా శిక్ష విధిస్తే నేరాలు తగ్గుతాయన్నారు. పాత బస్తీలో ఉర్దూ, హిందీ వచ్చిన అధికారులను నియమిస్తే నేరాల సంఖ్య తగ్గుతుందన్నారు.



యజ్ఞంలో భక్తులు

సనాతన వేదాంత జ్ఞానసభలు ప్రారంభం

● కనుల పండువగా శివపార్వతుల కల్యాణం

సరూర్‌నగర్, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ జిల్లా ఆర్యవైశ్య మహాసభ, సద్గురు మలయాళస్వామి భక్త బృందం ఆధ్వర్యంలో బాలాపూర్‌లో ఎస్పీఆర్ లక్ష్మీగార్డెన్స్‌లో మూడు రోజులపాటు నిర్వహించనున్న సనాతన వేదాంత జ్ఞానసభలు సోమవారం ఆడంబరంగా ప్రారంభమయ్యాయి. వ్యాసాశ్రమ వ్యాస పీఠాధిపతులు పరిపూర్ణానందగిరిస్వామి ప్రణవ పతాకావిష్కరణ చేయగా, సరూర్‌నగర్ మాజీ ఎంపీపీ సామల రంగారెడ్డి వినోద దంపతులు యజ్ఞేశ్వర ప్రతిష్ఠ, కాశెట్టి పాండుగుప్తా వీరమణి దంపతులు అఖండ జ్యోతి ప్రజ్వలన, సూరిశెట్టి శ్రీనివాస్‌గుప్తా సత్యవేణి దంపతులు కలశస్థాపన నిర్వహించారు. దేవీ ఉపాసకులు బ్రహ్మశ్రీ మురుకుంట్ల రాజేశ్వరశర్మ పర్యవేక్షణలో వేద పండితులు నవగ్రహ యజ్ఞాలు నిర్వహించారు. అనంతరం శివపార్వతుల కల్యాణం కనుల పండువగా నిర్వహించారు. పలు ప్రాంతాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో హాజరయ్యారు. ఈ సందర్భంగామాజీ డీజీపీ కె.అరవింద్‌కుమార్‌ను నిర్వాహకులు సన్మానించారు. పలు రాష్ట్రాల నుంచి విచ్చేసిన స్వామీజీలు, మఠాధిపతులు, పీఠాధిపతులు భక్తులకు ఆధ్యాత్మిక ప్రవచనాలు అందజేశారు.



శివపార్వతుల కల్యాణం నిర్వహిస్తున్న వేద పండితులు